

కొండముది శ్రీరామచంద్రమూర్తి

## మంచిపుస్తకాలు

జీవితరహస్యాలు:- మీ దాంపత్యసుఖానికి అనేక కామ సూత్రాలు.-...... రూ 3-50.
యువతి :- స్త్రీలను గురించి అనేక కుతూహల విషయాలు........రూ 3-50.
సంతానము.- గర్భనిరోధానికి 60 నవీన సులభ మార్గాలు..............రూ. 3-50.
పోష్టు ఖర్చులు చితం. క్రింది ఎడ్రస్సుకు వ్రాస్తే వి. పి. పోష్టుద్వారా మీయింటికి పంపబడును.

దేశసేవ ప్రచురణలు, ఏలూరు, (ఆంధ్ర)



ఉచితము ! ఉచితము !!

## తెల్లమచ్చలు

మా ప్రఖ్యాతివహించిన 'డాగ్‌సాఫా' ప్రత్యేక ఔషధము తెల్లమచ్చలను సులభముగ పోగొట్టుటలో 1925 సం॥ నుండి ప్రఖ్యాతి వహించి యున్నది. మూడురోజులు వాడినంతనే మచ్చల తెలుపుదనం అటుపైన కొన్ని రోజుల్లోనే పూర్తిగా బాగుచేయు శక్తిగలదు. ఉచితంగ ఒక పాకెట్ మందుఇవ్వబడును నకలునుచూచి మోసపోకండి. **Ashoka Treatment Centre, P. O. Katri Sarai (Gaya)**



## అతిమూత్ర రోగులందరికీ ఉచిత సలహా

మూత్రము ద్వారా చక్కెర వెలువడుట "మెల్లిటస్" అతిమూత్రవ్యాధి. (Diabetes Mellitus) చక్కెరలేకుండ తరచుగా మూత్ర విసర్జన జరుగుట "ఇన్‌సిపిడస్" అతిమూత్రవ్యాధి (Diabetes Insipidus) అనబడును. అమిత ఆకలి, దాహము, శరీరమంతా పోట్లు, బరువు తగ్గిపోవుట ఈ వ్యాధి యొక్క ముఖ్య చిహ్నములు. ఇవిగాక, చర్మవ్యాధులు, దురద, మూత్రకోశము, కాలేయము బలహీనమగుట మున్నగునవి గూడ పొడసూపవచ్చును. వీటికి వెంటనే తగుచర్య తీసికొనకున్నచో దృష్టిమాంద్యము. నిద్రలేమి, కీళ్లవాతము, మానసిక శారీరక శ్రమలయందు అయిష్టత మున్నగువాటికి దారి తీయ వచ్చును. ఇటువంటి లక్షణములతో బాధపడుచున్న రోగులు, ఇన్‌జెక్షన్లు, కఠిన పత్యములు, ఉపవాసములు లేకుండ తను వ్యాధిని నివారణ చేసుకొనుటకు తగిన ఉచిత వైద్యసలహా కొరకు మాకు వ్రాయవచ్చును. మించిపోకముందే మాకు వ్రాయండి.

**VENUS LABORATORIES (A' M.) P. O. Box No. 587 Calcutta-1.**


# జైలు

ఆ అమ్మాయికి నిస్సహాయత తెలిసినకొద్దీ భయం వేస్తున్నది. భయంతో గుండెలను చిక్కబట్టుకుంటూ, వచ్చే వచ్చే ఎక్కిళ్ళను బలవంతాన అపుకుంటూ మళ్ళీ మాట్లాడింది. "అయిదు కొట్లల్లో అడిగాను. లేవన్నారు. కోటగుమ్మం దగ్గరేదో కొట్టుందట. అక్కడిస్తున్నారట. అందుకని, అక్కడికని వెళ్తుంటే....." ఆశ చావక మళ్ళీ మళ్ళీ వెతుకుతోంది. "రూపాయి దొరక్కపోతే ఎట్లా? బియ్యం ఎట్లా కొనడం?" ఆ అమ్మాయి పడుతున్న తపన చూసి, పోసి కాలికింద దాచి పెట్టిన రూపాయి బిళ్ళను ఆ పిల్లకు ఇచ్చేద్దామా అనుకున్నాడు. అనుకొంటూనే అడిగేశాడు. "రూపాయి దొరక్కపోతే ఎట్లా పిల్లా? నీ అమ్మ నిన్ను కొడుతుందా?"

ఆ అమ్మాయి అడ్డంగా తల వూపింది. "ఉహూ కొట్టదు. నేనంటే మా అమ్మకు ఎంతో ఇష్టం."

"మరి.....?" సింహాద్రి ఏదో అడగబోయాడు. అడ్డుకుంటూ మళ్ళీ ఆ అమ్మాయే సమాధానం చెప్పింది.

"రూపాయి లేపోతే, బియ్యం కొనకపోతే, మా అమ్మకు, ఈ రాత్రికి, అన్నం ఎవరు పెడతారూ?"

ఈ మాట విని సింహాద్రి హృదయపు అట్టడుగు పొరల్లోవున్న మానవత్వం కొద్దిగా కదిలింది. ఆ రూపాయి ఇచ్చేద్దామనీ, ఇచ్చేయడమే మంచిదని, అనిపించింది. కాని సీతాలు కళ్ళముందు మెదిలి ఆ యత్నం విరమించుకున్నాడు. "ఈ రూపాయిస్తే నా తల్లి ఎన్ని బొమ్మలైనా కొనుక్కుంటుంది!"

ఆ అమ్మాయి ఇంకా వెతుకుతూనే ఉంది. ఆ దుమ్ములో—ఆ రాళ్ళలో, చీకట్లమధ్య సింహాద్రి ఉన్నట్టుండి కొంచెం పౌరుషంగా అన్నాడు. "వెళ్ళు వెళ్ళు. చీకటి కూడా పడ్డది. ఇంకా ఏం వెతుకుతావ్? వెళ్ళి నీ అమ్మను ఇంకో రూపాయి ఇమ్మను." అతనికీ తెలుసు, వాళ్ళ అమ్మ ఇంకో రూపాయి ఇవ్వలేదని. ఆ పిల్ల జాలిగా చూసింది. సింహాద్రి కళ్ళల్లో విసుగు, కోపంగా మారుతోంది. "వూ! చెప్తుంటే వెళ్ళవే?" అన్నాడు కఠినంగా. ఉలిక్కిపడి, సింహాద్రివేపు చూసి, ఆ కళ్ళల్లోని రక్తపుజీరకు కారణం తెలుసుకోలేక ఆ పిల్ల అయిష్టంగానే అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది. అల్లంత దూరం ఆ పిల్ల వెళ్ళిన తర్వాత, అటూ, ఇటూ చూసి ఒక్కసారిగా వంగి, కాలిక్రింద అణచి పెట్టిన రూపాయి బిళ్ళను చేతికి తీసుకుని, లాల్చీ జేబులో వేసుకుని ఇంటివేపుగా నడవడం ప్రారంభించాడు సింహాద్రి. అతని మనస్సును రెండుగా విడగొట్టి ఒక భాగాన్ని సంతృప్తి, రెండవ భాగాన్ని అసంతృప్తి రాజ్యమేలుతున్నాయి.

అతనికి ఎంతో హుషారుగా ఉంది. "భలే బోణీ!" అనుకున్నాడు. అతనికి దీపకాంతిలో స్నానం చేస్తున్నట్లనిపిస్తోంది. గోదావరిమీదినుంచి పరుగెత్తుకు వస్తున్న చల్లనిగాలి అతని నరాల్లోకి ప్రాకి వాటిని ఉద్రేక పరుస్తోంది. కోటిలింగాల రేవుదాటి, వెదుళ్ళ అడితిబుదాటి మరికొంచెం ముందుకువెళ్ళి ఓ రేకుల గదిముందు నిలబడ్డాడు. రేకు తలుపులు మూసిఉన్నాయి.

"సీతాలూ— ఓసీతాలూ!" అన్నాడు ప్రేమగా. ఎవ్వరూ పలకలేదు. తలుపుమీద చప్పుడు చేస్తూ "బుడిగీ!" అన్నాడు అధికారంగా. ఎవ్వరూ స్వాగతం చెప్పలేదు. తలుపులు నెట్టాడు. అవి మెల్లగా విడివడ్డాయి.

ఇంట్లో ఓ మూల చినిగిపోయిన చాపమీద పిల్లది ప్రాణంలేని కట్టెలా పడి ఉంది. 'అమ్మలూ..' అంటూ పరుగెత్తుకువెళ్ళి పిల్లదాని తలను ఒళ్ళోకి తీసుకున్నాడు.

సీతాలుకు జ్వరం కాలిపోతోంది. నుదుటిమీద చెయ్యివేసి చూశాడు. చెయ్యి చురుక్కుమంది. ఉండి ఉండి పిల్ల ఉలిక్కిపడుతోంది. "కొట్టొద్దు. కొట్టొద్దు. నే దొంగనుకాదు" అంటోంది.

"అమ్మలూ! బొమ్మలు కావాలన్నావు. డబ్బులు తెచ్చాను. ఎన్ని కొనుక్కోనచ్చు!" సీతాలు కళ్ళు విప్పిచూడలేదు. మన లోకంలో లేనట్టు పడి ఉంది. చిక్కి శల్యావశిష్టమై దీనంగా కన్పిస్తోంది. పరికిణీకి బదులు ఒంటికి ఏదో పాత గుడ్డ చుట్టబడిఉంది. దాని ఒంట్లోవున్న నిగనిగ ఎక్కడికి పోయిందో సింహాద్రికి తెలీలేదు. అట్లాగే చూస్తూ కూచుండిపోయాడు.

"వచ్చావా మావా!" వెనగ్గా బుడిగి కంఠస్వరం—పోగొట్టుకొన్నదేదో దొరికినంత సంతోషంగా. "హాసి—నువ్వటే?!" సీతాలు తలను మెల్లగా ప్రక్కకు తప్పించి, లేచి నిలబడి పరుగెత్తుతున్నట్టుగా ముందుకు నడిచి భార్యను కావలించుకొన్నాడు. బుడిగి చెంపలమీదుగా నీళ్ళు కారిపోతున్నాయి.

"ఎన్నాళ్ళ కొచ్చావ్ మావా?"

"రెన్నెల్లే కదూటే?"

"నీకు రెన్నెళ్ళూ, నాకు రెండేళ్ళూ."

"వచ్చేసేను కాదే?"

సింహాద్రి మెడచుట్టూ చేతులువేసి దగ్గరకు లాక్కుంది బుడిగి. "ఈ రెన్నెళ్ళూ ఎన్ని బాధలు పడ్డానని. కూడే దొరకనేదు మావా? పిల్లదాని కూడా పస్తే ఉంచాను. జొరం కాస్తే...." బుడిగి గొంతులో దీనత్వం. కళ్ళలో నీడలు. "ముందు మందట్రా మావా! అదే పోదా అని పస్తాయించాను. పొద్దటికి అమ్మోరిలా పెద్దదైంది. ఆ డాక్టరుబాబు నిజంగా దేముడు, ఇట్టె జొరం అని సెప్పి, అట్టా సీటీరాసి, గొట్టాలట్రా అన్నాడు"

కొంత విని కొంత వినకా, లాల్చీ జేబులోకి చెయ్యి పెట్టాడు సింహాద్రి. రూపాయిబిళ్ళ కన్పించలేదు. ఖంగారుపడి జేబులు గాలించాడు. వేళ్ళు బయటకు వచ్చాయి.

రంగులు మారిపోతున్న మొగుడి మొహం వంక చూస్తూ "ఏటి మావా!—ఎతుకుతున్నావ్?" అన్నది బుడిగి ఉండబట్టలేక.

"డబ్బులే!"

"ఎక్కడివి?"

"ఓ పిల్లదాని దగ్గర కొట్టేసినా"

"ఓ దొంగ సచ్చినాడా ఇట్టాగే అని మన పిల్లదాన్ని నంజేసినాడు మొన్న. అప్పట్నుంచే

54 వ పేజీ చూడండి

దాని మానేసి వెడిపోనాడు. అది పసిపళ్ళు కొట్టే పిందంట. ఎవడో పొంగటప పటుగెత్తి పోతూ, పోతూ, రోడ్డు పక్కన పిడ్డ దీని చేతుల్లో పారేసినాట్లు ఉత్తి పళ్ళు."

"సరికేస్తా వాణ్ణి." సింహాద్రి పళ్ళు బిగించాడు. "నా పేరాలు దొంగ. సీతా!"

"సర్లే. అణ్ణి భగవంతుడే సరుకుతాడు.

## జైలు

12 వ పేజీ తరువాయి

మందీ గొట్టాలట్రా. పిల్లదాన్ని బతికించు."

కనిపించని భగవంతుడు తన విూదొచ్చాకు కష్టాల్లో తెలిలేదు సింహాద్రికి. "సర్లే" అని అయిష్టంగా అని గడపదాటి వెళ్ళిపోయాడు.

"మరి మాదెట్టా మావా?"

సింహాద్రి సమాధానం చెప్పలేదు. చెప్పడానికి సింహాద్రి సమాధానం చెప్పడో అనుభవంలోచ వచ్చిన బుడిగి ఆ విషయాన్ని మరి రెట్టించలేదు. డబ్బె స్తే వస్తుందో ఇద్దరూ ఎవరికి వాళ్లే వూహించుకున్నారు. డబ్బుకూ, అన్యాయానికి లంకె ఉంది.





ఇప్పుడు, సొగసైన కొత్త రూపులో!

ఎక్కడ
**లైఫ్‌బాయ్** వున్నదో
అక్కడ ఆరోగ్యము వున్నది

హుషారుగా! ఉల్లాసంగా! ఆరోగ్యంగా! వుంటారు లైఫ్‌బాయ్‌తో స్నానానంతరం. లైఫ్‌బాయ్ మురికిలోగల క్రిములను కడిగివేస్తుంది. మిమ్ములను శుభ్రంగా...హాయిగా...ఆరోగ్యంగా, వుంచుతుంది! అంతేగాక, లైఫ్‌బాయ్ పైగల కొత్త కాగితపు మూత ఎంత సొగసైనది! పట్టుకొనుటకు వాటమైన కొత్త ఆకారం గలది, మీ కోసమే నిర్మించబడ్డది. లైఫ్‌బాయ్ సబ్బును నేడే కొనండి!

హిందుస్థాన్ లీవర్ ఉత్పత్తి

L. 47-140 TEL

"తొందరగా రా మామా!"

"ఛాన్సు తగలద్దూ?" కొంత అసహనమ్మి కంతో ఆ మాట అని, "పిల్లది జాగర్త. మొహం మీద తడిగుడ్డేయ్" అంటూ తలవంచుకు వీధిలోకి వెళ్ళాడు.

ఆ వెళ్ళడం వెళ్ళడం ఓ మెడికల్ షాపుకు వెళ్ళాడు. "అయిదు గొట్టాలూ పది రూపాయలు" అన్నాడు బల్లమీది డబ్బులు లెక్క పెట్టుకుంటున్న టెర్లిన్‌షర్టు బట్టతల నడివయసు పెద్దమనిషి. బరువుగా బయటకు రోడ్డుమీదకు వచ్చేసేడు సింహాద్రి. వెనగ్గా నవ్వులు.

బయట ఆకాశంలో చంద్రుడు మబ్బుల ప్రక్కకు తప్పుకున్నాడు. ఎలక్ట్రిక్ దీపాలు బాధతుడి హృదయ జ్వాలలా జ్వలిస్తున్నాయి. వనిమిదింటికే రాజమండ్రి నిద్ర కుపక్రమిస్తోంది. సింహాద్రి గోదావరి స్టేషనుకు వచ్చాడు. చెదురు మదురుగా వున్న ప్రయాణీకులు తప్ప, రద్దీ కన్పించలేదు. తొందర్లో బండి ఏదీ వచ్చే సూచనలేదు. ప్లాట్‌ఫారంమీద అటూ, ఇటూ కొంచెంసేపు తిరిగాడు. గోదావరిమీదనుంచి వచ్చే చలిగాలితప్ప మరెవరూ అతన్ని పల్కరించలేదు. స్టేషన్లోంచి బయటకు వచ్చి కోట గుమ్మం వైపుగా నడిచాడు. కొంచెం సందడిగా ఉంది అక్కడ. పర్వాలేదు. మనుషులున్నారు. బేరాలు సాగుతున్నాయి. డబ్బు నీళ్ళలా ప్రవహిస్తోంది. సెంటర్లో నిలబడి అటూ, ఇటూ చూస్తూ ఆలోచిస్తున్నాడు సింహాద్రి. "ధర్మం సెండి బాబూ! పున్నెమొస్తది." కళ్ళులేని కబోది దీనంగా అరుస్తోంది. దూరంగావున్న మసీదులోంచి అరబిక్ అల్లా ప్రార్థనాగీతం గాలిలో మెళ్ళు తిరుగుతోంది.

ఛాన్సుకోసం ఎదురు చూస్తున్నాడు సింహాద్రి.

ఎదురుచూస్తూ నిలబడ్డ సింహాద్రి దగ్గరకు ముసి ముసిగా నవ్వుతూ ఒకతను వచ్చాడు. వస్తూనే "వస్తారాసార్?" అన్నాడు.

సింహాద్రి ఆలోచిస్తూనే "ఎక్కడికి?" అన్నాడు.

"మొన్నేసార్ వచ్చింది. వేపారానికి పూర్తి కొత్త. మీలాంటోళ్ళు....." దూరంగా ఎర్ర బుట్టి కన్పించడంతో, మధ్యలో ఆపేసి, తొందర తొందరగా, "పోదాం పదండిసార్" అన్నాడు.

"అక్కర్లేదు" సింహాద్రి సమాధానం విని పెద్దమనిషి తెల్లబోయాడు. ఎగా దిగా చూస్తూ "ఓస్సోసి" అంటూ అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు. సింహాద్రికి ఆగంతకుని మాటలు కొంత అర్థమయాయి. "ఎవరి తాపత్రయం వాళ్ళది" అనుకున్నాడు. అతనికి బుడిగి జ్ఞాపకం వచ్చింది. జ్వరంతోవున్న సీతాలు కళ్ళముందు మెదిలింది. సీతాలుతోపాటు రూపాయి పారవేసుకున్నా పసిది జ్ఞాపకంవచ్చింది. అతని హృదయం కలుక్కుమంది.

కోట గుమ్మం దగ్గర లాభం లేదనిపించి ప్రక్కసందులోకి తిరిగాడు. గోపాలస్వామి ఆలయంలో దీపాలు వెల్గుతున్నాయి. దేముని విగ్రహం దూరంనుంచే ఆకర్షిస్తోంది. దేవాలయం నిండా ఎక్కువమంది ఆడవాళ్ళు. సింహాద్రి దేవాలయం ముందు ఆగాడు. పూజారి హారతి ఇయ్యడం కన్పిస్తోంది. "సీతాలుకు జ్వరం తగ్గితే బావుణ్ణు"

సింహాద్రికి అక్కడకు వచ్చిన ఆడవాళ్ళ మెళ్ళల్లో దీపకాంతికి మెరుస్తున్న రాళ్ళ నెక్లెసులు కంటపడ్డాయి. ఒకావిడ మెళ్ళో అయిదు పేటల చంద్రహారం. మరోకావిడ నాజూగ్గా మోచేతివరకూ బంగారపు గాజులు వేసుకుంది. సింహాద్రి కళ్ళు మెరిశాయి. అతని బుద్ధి అతన్ని వత్తిడి చేస్తున్నది. అతడు తన జీవితంలో మొట్టమొదటిసారిగా దేవాలయం లోపలకు వెళ్ళాడు. వెళ్ళి దేవునిముందు అనుకోకుండా చేతులు కట్టుకు నిలబడ్డాడు. గోపాలస్వామి తన వైపే చూస్తున్నట్లనిపిస్తోంది. "నా తల్లికి జ్వరం తగ్గాలి." అనుకున్నాడు. కళ్ళు మూసుకుని, చేతులు రెండూ జోడించాడు. చేతులు జోడించడంలో అంతవరకూ గుప్పిటమధ్యవున్న మందు చీటీ నలిగిపోయింది.

"తీర్థం పట్టు నాయనా!" పూజారి కంఠస్వరం. తల నెరిసిన మనిషి. శరీరం పండిపోయింది. సింహాద్రి చీటీని చెవిలో దోపుకుని, అంజలి ఘటించి తీర్థం పుచ్చుకున్నాడు. తీర్థం పుచ్చుకొన్నవాళ్ళు ఒక్కరొక్కరే స్వామికి నమస్కరించి వెళ్ళిపోతున్నారు. ఆడవాళ్ళు అడుగుముందుకువేసినపుడల్లా బంగారపు నగల రవరవ అతడి చెవులను కోసివేస్తున్నది.

దేవాలయం దాదాపూ నిర్జనమౌతున్నది. దేవుణ్ణి గర్భగుడి లోపల బంధించటానికి పూజారి సిద్ధమవుతున్నాడు. సింహాద్రి రెండడుగులు ముందుకువేసి నిలబడ్డాడు. గోపాలస్వామి నిండు విగ్రహం అతని కంటపడుతున్నది. నెత్తిన పింఛమూ, మెరుస్తున్న కళ్ళూ; "ఓహో! ఆ కళ్ళలో నీలాలు తాపి ఉంటారు." అనుకొన్నాడు సింహాద్రి. ఆ భువన మోహనమూర్తి పెదవులు విడీ విడకుండా మురళిని వాయిస్తున్నాడు. "అది బంగారపు మురళే. సందేహంలేదు." అనుకున్నాడు సింహాద్రి. గోపాలుని మెడలోని హారాలు ఒక దానితో ఒకటి అందానికీ, ఆశ్రయానికీ కలహించుకొంటున్నాయి. సింహాద్రి దృష్టి ఆ హారాలమీద పడింది. గోపాల స్వామి పట్టుబట్ట కట్టుకున్నాడు. కట్టుకుని మామిడి పిందెల మొలతాడుమీద బిగించాడు. కాళ్ళకు రత్నాల కడియాలు. చూస్తూ చూస్తూ సింహాద్రికి సీతాలు జ్ఞాపకం వచ్చింది.

సీతాలుకు జ్వరం వచ్చింది. దానికి జ్వరం తగ్గాలి. సీతాలు ప్రక్కనేవున్న బుడిగి బోసి మొడతో నవ్వుతుంది. దీనంగా, పేదగా, దిగులుతో.

(సశేషం)


త్వరలో ప్రారంభం!

'వైజ్ఞానిక గాథాశతి'

సరికొత్త వ్యాసశీర్షిక

రచన

'డాక్టర్'



పుస్తకములు

5 పుస్తకముల సెట్టు రు. 3-50.

(1) కొక్కోకశాస్త్రం (2) సుహాగ్రాత్ (3) చుంబన పద్ధతులు, (4) 84 ఆసనములు, (5) రహస్యఫోటో ఆల్బం. ఒక్కొక్క పుస్తకం రు. 2/-. పోస్టేజి, ప్యాకింగ్ అదనం. ఇంగ్లీషులో వ్రాయండి.

ARHANT BOOK DEPOT,

26, ALIGARH (U. P.)



పాదాలలో ఆనెలు

పాదాలలో ఆనెలు, కండలుపెరిగి, వ్రేళ్ళపాతుకుపోయి పాదములు నేలపై బెట్టలేక రాళ్ళుతగిలిన త్రుళ్ళిపడువారు పైపూతగావాడిన వ్రేళ్ళతోసహామాయంచేయగల సంజీవి. వెల పోస్టుఖర్చులతో రు.5-50న.పై.

కొక్కోకము చిత్రపటములు గలది. రు. 1-50

దాంపత్య రహస్యములు ... రు. 3-00

తెలుగు హిందీ స్వయంశిక్ష రు. 4-50

తెలుగు-ఆంగ్ల భాషాబోధిని రు. 5-00

పోస్టు ఖర్చులు ప్రత్యేకము.

ప్రభ అండ్ కో.

3, మలయపెరుమాళ్ వీధి, మద్రాసు-1



LUCODERMA

శక్తివంతమైన మా ఆయుర్వేద ఔషధము "శ్విత్ర మోచన్" తెల్ల మచ్చలను కొద్ది రోజులలో తొలగించును. సాంఘిక సంక్షేమం కొరకు 1000 రోగులకు ఒక్కొక్క పాకెట్ ఉచితంగా యివ్వబడును. వెంటనే వ్రాయండి.

BIHAR KUSTA KUTIR,

(2) P.O. LALBIGHA (Gaya)



ఫోల్డింగ్ 50 షాట్ పిస్టల్

లైసెన్స్ అక్కరలేదు. అమెరికన్ మోడల్, దొంగలు క్రూరమృగముల నుండి రక్షించుకోండి. ఉల్లాస ప్రయాణాలు, యాత్రలు, నాటకాలకు ప్రశస్తమైనది. ఆటోమేటిక్ 50 షాట్లు ఏర్పాటు గలదు. తేలికైనది. ఇందు నుండి వెలువడు నిప్పురవ్వలు మిమ్మును కాపాడును.




ధర: 50 షాట్లు గల నెం.33 రు.13/50. జర్మన్ మోడల్ నెం. 99 రు. 15/50. వి.పి.పి. చార్జీలు రు. 2/50. లెదర్ కేస్ రు. 3/50. అదనపు షాట్లు 100 కి రు. 5/-.

SULEKHA TRADERS (AP-13)

PHAPHALA, ALIGARH.




(గత సంచిక తరువాయి)

పూజారి గర్భగుడి తలుపులు మూసి "పద నాయనా!" అంటూ సింహాద్రితో కలిసి బయటకువచ్చి సింహద్వారం మూసివేశాడు. సింహాద్రి పూజారి ప్రక్కనే నడుస్తున్నాడు. అతని కళ్ళలో పేతాలు. అతని మనసులో ఉడికి. పూజారి, దేవాలయం ప్రక్కనేవున్న తన కుటీరంలోకి వెళ్ళి తాళం చెవులు భద్రపరిచి మళ్ళీ బయటకు వచ్చాడు.

ఇంకా సింహాద్రి అక్కడే ఉన్నాడు.

"ఎవరు నాయనా నువ్వు?"

"దాహం కావాలి తాతా!"

"లోపలకురా నాయనా." పూజారి లోపలకు వెళ్ళాడు. సింహాద్రి లోపలకు వచ్చాడు. ఎదురుగా చూస్తే రాములవారి పటం. వెనగ్గా ఆలయం తాళం చెవులు. లోపలకు వెళ్ళిన పూజారి ఇంతట్లో బయటికి వస్తాడా? సింహాద్రికి గోపాలస్వామి విగ్రహం నిల్చింది కళ్ళముందు. విగ్రహమంతా బంగారపు తొడుగే. సింహాద్రి పిరికిగాలేచి నిలబడి, భయంగా ముందుకు అడుగువేసి, వణకుతున్న చేతులతో తాళం చెవులు తీసుకుని బొడ్లో దోపుకుని లాల్చీ సరి చేసుకుని ధైర్యంగా తిరిగి నొచ్చి సంతృప్తితో యథాస్థానంలో కూచున్నాడు.

పూజారి మజ్జిగ వొక గ్లాసులో పోసుకుని ఇంత భగవత్ప్రసాదం పళ్ళెంలో పెట్టుకుని తీసుకు వచ్చాడు.

"తీసుకో బాబూ!"

సింహాద్రికి అతన్ని చూసి నమస్కారం చేయా అనిపించింది. "మీకు పిల్లలున్నారా తాతా?"

పూజారి అరువుగా తల వూపాడు. "ఇప్పుడు కాదు." వాతావరణం గాలి చేస్తున్న చప్పుళ్ళతో వింతగా ధ్వనిస్తోంది. "ఒకడు దొంగ, మరొకడు అప్రయోజకుడు. దొంగను నేనే ఇంట్లోనుంచి తరిమేశాను. ఆ అప్రయోజకుడు భార్యాదాసుడై నన్నే ఇంట్లోనుంచి తరిమేశాడు. ఇప్పుడా వేణు గోపాలుడే తల్లి తండ్రీ కొడుకూ కూతురూ సమస్తమూ."

సింహాద్రి ప్రసాదం పుచ్చుకుని మజ్జిగ తాగి "వస్తాను తాతా!" అన్నాడు లేచి నిలబడుతూ.

"జాగర్త నాయనా! అమాయకుడిలా ఉన్నావ్"

పూజారి కంఠస్వరం వెనకనుంచి బుజ్జగిస్తోంది. సింహాద్రి రోడ్డుమీదకువచ్చి మళ్ళీ దేవాలయం దగ్గరకు వెళ్ళాడు. పూజారి ఇంట్లో దీప కాంతి తగ్గడం అతనికి కన్పిస్తోంది. పూరు మాటు మణుగుతోంది. సందు నిద్రపోతోంది.

సింహాద్రి తొందర తొందరగా దేవాలయం తలుపులు తెరచి, తను లోపల దూరి మళ్ళీ తలుపులు మూశాడు.

విశాలమైన దేవాలయం. ఒంటరిగా ఉన్నా భయం తెలియని సింహాద్రికి భయం వేసింది.

గుండెలు చిక్కబట్టుకుంటూ ముందుకు నడిచాడు. తలుపు కన్నాలలోంచి లోపల బందీగా వున్న గోపాలస్వామి కనబడుతున్నాడు. ఇంకా అతడు నిద్ర పోలేదులా ఉంది. కళ్ళు మెరుస్తున్నాయి.

సింహాద్రి పిరికి పిరికిగా గర్భగుడి తలుపులు తెరిచాడు. కీచుమంటున్న శబ్దం. అతని గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. గబగబా ప్రక్కకు తప్పుకున్నాడు. మళ్ళీ నిశ్శబ్దం. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు విన్పించేటంతటి నిశ్శబ్దం. సింహాద్రి స్వామికి ఎదురుగా నిలబడ్డాడు.

దేవుడు మానవుణ్ణి చూసి నవ్వుతున్నాడు. మానవుడు దేవుణ్ని చూసి భయపడుతున్నాడు.

సింహాద్రి చేతులు వణుకుతున్నాయి. లోపలి పాములా మెలికలు తిరుగుతున్న కోర్కె గిట్టూర్పు రూపాన బుస కొడుతోంది. స్వామి ఒంటిమీద చెయ్యి వేశాడు సింహాద్రి. రాతిదేవుడు మాట్లాడ లేదు.

సింహాద్రి గుండెలు చిక్కబట్టుకుని ఒక్కొక్క అలంకారమే వొల్చి క్రింద పెట్టాడు. నేలమీద ఉన్న బంగారపు నగలు మెరిసిపోతున్నాయి. నగల్లేని దేవుడు, దేవుడిలా కనబడటంలేదు. రత్నాల కన్నుల్లేక దేవుడు గుడ్డివాడై పోయాడు. సింహాద్రి ధైర్యంగా నగల నన్నింటినీ మఫ్లర్‌లో మూట కట్టుకుని, వెనుతిరిగి చూడకుండా బయ

పూజారి ఇంటివైపు చూశాడు సింహాద్రి. అది నిమ్మకు నీరెత్తినట్టుగా ఉంది. దేవాలయం గడపదగ్గర తను పడేసిన తాళం చెవుల కోసం చూశాడు. ఇంకా అవి అక్కడే ఉన్నాయి. "ఓహ్! ప్రపంచమంతా దొంగలమయం కాదన్నమాట! పెట్టిన వస్తువు పెట్టినచోట ఉంటున్నది. అందులో ఎంత భరోసా ఉన్నది!"

వాటిని తీసుకుని, తలుపులుతీసి, లోపలకు ప్రవేశించాడు. ప్రవేశిస్తుంటే ఈసారి భయం వెయ్యలేదు. సంతోషంగా ఉంది. గర్భగుడి తలుపులు తొంగి, గోపాలస్వామి నవ్వుతున్నట్లు కనిపిస్తున్నాడు. సింహాద్రిస్వామి ముందు, మోకాళ్ల మీద కూచున్నాడు. "తండ్రీ!" అన్నాడు. చేతులు జోడించి. "ఇంక నే దొంగతనం సెయ్యను. మా అమ్మన్ని కాపాడు. ఇదుగో నీ నగలు, ఒక్క కడియం మాత్రం—అదుసు సామీ—అది ఆడు కొట్టేసినాడు, నన్ను మోసం చేసినాడు—నాను తప్పుసేయలేదు. నీకు అంతా తెలుసు. నన్ను రచ్చించు సామీ!"

సింహాద్రి హృదయం సంతోష తరంగ సంభరితమైంది. అతనికి తను శుచి అయినానన్న భావన కల్గుతోంది. ఆ నగలన్నీ గోపాలస్వామికి అలంకరించా లనిపిస్తోంది. వెనక్కు చూశాడు. ఎవ్వరూ లేరు.

సింహాద్రి, బంగారు మురళిని స్వామి హస్తాల మధ్య పదిలపరిచాడు. హారాలు నల్లనయ్య మెడలో వేశాడు. పీతాంబరం మొలకు చుట్టి, మామిడి పిందెల మొలతాడు దానిపై అలంకరించాడు. ఆతర్వాత తలయెత్తి కన్నులపండువుగా స్వామి నిజదర్శనం చేసుకున్నాడు. "ఎంత అందంగా ఉన్నావు సామీ! నీ నగలు దొంగిలించాను" అనుకున్నాడు లెంపలు వేసుకుంటూ. ఆ తర్వాత వంగి, పాదానికి కడియం వెయ్యబోయాడు.

వెనగ్గా చప్పుడు.

మోకాళ్లమీదకు వంగి ఉన్న సింహాద్రికి అలంకరిస్తున్న చేతుల క్రిందుగా కళ్లను ధనుస్సులుచేసి వెనక్కు చూశాడు. మనుషులు పురుగుల్లాగా, పుట్టగొడుగుల్లాగా, ఆశల రూపాల్లాగా, నల్లగా కోపంగా, పాపంగా కన్పించారు. హఠాత్తుగా లేచి నుంచున్నాడు.

"పట్టుకోండి. పట్టుకోండి. దొంగ. దొంగ. దేముడి సొమ్ములు దొంగిలిస్తున్నాడు. వెధవ స్కౌండ్రల్."

సింహాద్రి తలఎత్తి చూశాడు. ఆ కళ్లల్లో ఆకలీ, కోపమూ కన్పించాయి జనంలో అతన్ని తిట్టేసినవాడికి. సింహాద్రికి తనను తిట్టిన ఆ పెద్దమనిషి మొహం పరిచయమైనదిగా కన్పించింది.

జనం కర్రలతో, రాళ్లతో ముందుకు వస్తున్నారు. వెనకనుంచి పూజారి మాటలు బాధగా విన్పించాయి.

"నువ్వా!—అయ్యో, ఎందుకు చేశావిపని?"

సింహాద్రి, పూజారిని చూసి జవాబు చెప్పటానికి తడబడ్డాడు.

పూజారి, గోపాలస్వామి వేపు చూశాడు, "ఏమిటి స్వామీ? ఇదంతా!" అన్నట్లు. పూజారి దృష్టి

# జైలు

స్వామి పింఛముపైనుండి వక్షస్సు వైపుకు, వక్షస్సుపై నుండి కటిమీదకు, కటిపైనుండి పాదాగ్రములపైకి మరలింది. పాదాలను చూసి ఆయన కంగారుపడ్డాడు. ఒక పాదానికి మాత్రమే కడియం ఉన్నది!

పూజారి ఉచ్చైస్స్వరంతో అన్నాడు. "స్వామి రెండవ పాదానికి కడియం లేదు."

జనమంతా 'కడియం, కడియం' అని అరవడం మొదలెట్టారు. ఆ అరుస్తున్నవాళ్లల్లో మరింత పెద్దగా అరుస్తున్న పెద్దమనిషివైపు చూశాడు సింహాద్రి. ఆ మొహం అతనికి మెల్లమెల్లగా జ్ఞాపకం వచ్చింది. ఆ మొహం 'తన దగ్గర నుంచి కడియం దొంగిలించిన మెడికల్‌షాపు యజమాని!'

సింహాద్రి కళ్లు కోపంతో ఎర్రబడ్డాయి. పిడికిలి బిగించి, లేచి నుంచుంటూ, "నేను కాదు ఆ కడియం దొంగిలించింది" అంటూ అరిచాడు పెద్దగా.

"దైవసన్నిధ్యంలో అబద్ధం చెప్పకు నాయనా!" వెనకనుంచి పూజారి స్వరం బాధగా ధ్వనించింది. "ఆ కడియం అక్కడ పెట్టు."

"నా దగ్గర లేదు. అడుగో ఆయన దగ్గరుంది—ఆ మందుల కొట్టాయన దగ్గర." చూపులతో, వేళ్లతో నిర్దేశించాడు సింహాద్రి.

"అ.... బ.... ద్ధం...." మెడికల్‌షాప్ యజమాని వణికిపోయాడు. అది కోపంతో అనుకున్నారు జనం.

"నే.... నే.... గౌరవంతో బ్రతికేవాణ్ణి." "అవును!" జనత వంతపలికింది.

"నామీద వీడికి కోపం." "కాదూ?!" జనత తలూపింది.

"వొందా తిమ్మన్నాడు. ఉట్బేరిమ్మన్నాను. ఇస్తానని ఇట్టా వచ్చాడు. అప్పుడే అనుమానం వేసింది. వేసే, వాడివెంట ఇట్టా వచ్చాను. అందుకని ...." "నిజం. నిజం. నిజం. నీవు చెప్పిందే నిజం. వాడే దొంగ" జనం సముద్రంలా రొద చేసింది. 'దొంగ' అన్న పేరుతో ఆలయం ప్రతిధ్వనిస్తోంది. "దొంగతనం చెడ్డది నాయనా!" పూజారి జాలిగా అంటున్నాడు.

"నాను దొంగని కాను.... నాను దొంగను కాను." సింహాద్రి గింజుకుంటూ అరిచాడు.

"కాకపోతే దొరవా?"

"అవును. దొర్నే. మీరూ నిజంగా దొంగలు." ఆ మాటతో ఇరవై చేతులు పైకి లేచాయి. పది కర్రలు సింహాద్రి తలమీద పడ్డాయి. "దేవుడా! తప్పు సేసినోడు నన్నువ్వు రచ్చించలేదు. మనిషిగా మారినప్పుడు నన్ను సిన్నసూపు సూత్తున్నావ్. ఇదేటి నాయం!?" అనుకుంటూ స్వామి పాదాల దగ్గర సింహాద్రి పడిపోయాడు. పడిపోతున్న వాడికి బుడిగి ఏడుస్తూ కళ్లల్లో మెదిలింది. సీతాలు కళ్లల్లో ప్రాణంలేక కనబడింది.

తెలివి వచ్చి కోర్టులో జడ్జీగారి దగ్గర బోనులో నిల్చున్న సింహాద్రికి, మెడికల్‌షాపు యజమాని తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పడం కన్పించింది. "పెద్దమనిషి సాక్ష్యం!" సరళంగా, జీవన సత్యం తెలుసుకున్నవాడిలా నవ్వాడు సింహాద్రి. ఆ నవ్వును అంగీకారంగా తీసుకుని రెండున్నర నెలలు కఠిన శిక్ష విధించాడు న్యాయాధిపతి. శిక్షపడి మళ్లీ సెంట్రల్ జైలులోకి వస్తున్న సింహాద్రిని చూస్తూ అన్నాడు వార్డరు.

"మొన్నేకదుట్రా నువ్ వెళ్లింది?"

"అవును. మొన్ననే జైలులోంచి వెళ్లాను. ఇవ్వాళే విడుదలై వచ్చాను." అన్నాడు సింహాద్రి సీతాలును తల్చుకుంటూ, బుడిగిని గూర్చి బాధపడుతూ, లోకంమీద కసితో. ★

